


# కాటేసిన సిరి

**శరదపర సంధ్య** శోభలో నానుతూ, శుష్క నాగరికత నలంకరించుకొని, యవ్వనం తొలి విసురులో, భ్రమసిత ఆనందాల గాలానికి చిక్కుకొని, నీటుగా తయారయి, వేళతప్ప కుండా, సత్యం ఇంటి కెదురుగా, భూతాల చెట్టుపక్కనుంచి, ఉత్తరంగా పోయే పంచాయితీ గతుకుల రోడ్డుమీదినుంచి వెళ్లిపోతున్న శ్రీరాంను ఇంట్లోనుంచి బయటికి వస్తూ చూసిన సత్యంలో దిగులు మరోసారి పడగవిప్పి భయపెట్టింది. ఇంట్లో అమ్మ వెక్కుతూ వెక్కుతూ ఏడుస్తున్నది. పదేళ్ల తమ్ముడు అర్థంకాని అమ్మ ఆవేదనను చూసి చూసి— చివరికి దిగులుగా, నిస్సహాయుడుగా కూచున్నాడు ఆమె కళ్ల ముందు.

వరద వచ్చిన ప్రతిసారీ దుఃఖం బరువుతో

అమ్మ అంతరాంతరాల అనురాగాలు మాత్రుత్వాన్ని సుళ్లుతిప్పి పొంగుకొస్తాయి. ఆ రోజు వంశధార ఉద్వృత్తశక్తితో నియంత ఉద్రేకంలా ఒడ్డులు మింగేసి ఊడ్చేసింది. తమ పేద జీవితానికి పెన్నిధి పద్మక్కను నదీమాత పొట్టపెట్టుకొంది. తండ్రి దిక్కులేని తమ దారిద్ర్య జీవితం అక్క ఉదారతనుకూడ నిలుపుకోలేని హీనావస్థకు దిగజారిపోయింది. ప్రతి ఏడూ వరదలు వస్తున్నాయి. అమ్మ గుండె వరదైపోతుంది ఆ రోజుల్లో. నిద్రాహారాల్లేకుండా ఏడుస్తుంది. అలవాటయిపోయింది గనక, ఇరుగూ పొరుగూ "పాపం కూతురు మతి బడ్డది — కన్నకడుపు బాధ" అని నిట్టూర్చి, తమ పనుల్లో నిమగ్నులై ఊరుకొంటారు.

సత్యానికి కూడ ఆ ఆక్రందన అలవాటయి పోయింది. ఓదార్చినా వినదు. విసుక్కొని బయటపడ్డాడు. వీధిలో సంపదల్లో మునిగి తేలుతున్న శ్రీరాం పోతూ కన్పించాడు సుకుమారంగా.

పొరుగూరు లక్షాధికారి పద్మను పెళ్లి చేసుకొన్నాడు. తండ్రి పోయిన ఆ కుటుంబానికి పద్మ ఓ ఆధారమయింది. ఇంటి అవసరాలన్నీ నిండుకోకముందే నౌకర్లతో పంపించేది. ఇంటిల్లిపాదికి కొత్త గుడ్డలు పంపించేది. ముగ్గురు పిల్లలను, భార్యను విడిచి వెళ్లిపోయిన తండ్రి బాధ్యత ఆమె నెరవేర్చింది. అలా మూడేళ్లు గడిచాయి. ఇల్లు సుఖ సంపదలతో పొంగింది. అక్కదగ్గరే ఉండి పొరుగూర్లో ఉన్నత పాఠశాలలో సెకండరీ విద్య అభ్యసించాడు సత్యం. చిన్న తమ్ముడు పద్మక్క గుండెలమీద పెరిగాడు. ఒకటే కుటుంబంగా సాగుతున్న జీవితంలో ఓ వరద రోజున రెండు చేసే గోడలు విరిచి పోయినాయి. పిల్లలను పట్టుకొని స్వగ్రామానికి తల్లి వచ్చేసింది — పుట్టెడు దుఃఖం మోసుకొంటూ.

పద్మక్కే ఉంటే—

ఈనాడు—

శ్రీరాంలా తనూ నందివర్ధనం పువ్వులా తయారయేవాడు. డాక్టరీ చదివేవాడు. లేక ఇంకేదో గొప్ప చదువు — కలక్టరో — ఇంజనీరో —

సత్యం ఆశలను ఆరేళ్ల క్రితమే మింగేసింది వరద — అమ్మ ఆత్మను ప్రతియేడు చిత్రహింస చేసే వంశధార వరద.

శ్రీరాం మలుపు తిరిగి దృష్టిలోనుంచి మాయమయాడు. జానకి దగ్గరికి వెళ్ళుతున్నాడు. శ్రీరాం తన వయసువాడు. జానకి తనకంటే పెద్దది. అప్పుడే జీవితాలతో క్రీడ ఆరంభమయింది. ఇరవయ్యేళ్ల యవ్వనానికి యిదీ పరమార్థం!

అలాంటి సంపదే తనకుంటే — అనుకొన్నాడు సత్యం. ఏమి చేసేవాడో తెలీలేదు. కాని ఒకటి — ఉన్నత విద్య తప్పక అభ్యసించేవాడు. దేశానికి ఎన్ని సమస్యలు — ఓ రాజకీయ నాయ

*దారిద్ర్యం సర్వానర్థాలకు మూలకారణం. దానిని భరించే శక్తి కారణ జన్ములకు కాని అలవడదు. లేమి ఆత్మగౌరవానికే అంకుశపు పోటు. ఆత్మ గౌరవం నశించిన తరువాత ఏమిఉన్నా, లేకపోయినా ఒకటే. తోడివారి సానుభూతికూడా పొందలేరు, అలాంటివారు. అది వర్ణించనలవికాని స్థితి. అనుభవానికి హద్దులూ ఉండవు.*

కుని ఉపన్యాసం గుర్తుకు వచ్చింది — అలాంటి సమస్యలకు పరిష్కారాలు వెతికేవాడు. ఉత్తర భారత్‌లో హిందూ ముస్లిం తగాదాలు, దక్షిణ దేశంలో ద్రావిడ మున్నేట్ర కజగమ్, కాశ్మీర్ మీద పాకిస్తానీలు, చైనా దురాక్రమణ, కాందిశీకులు, నిరుద్యోగం, వరదలు...

రోజు రోజుకూ కాంతిహీనమైపోతున్న అమ్మ కళ్లు, శిథిలమైపోతున్న ఆరోగ్యం, బెంగ... సత్యానికి తన స్థానం గుర్తుకు వచ్చింది. తను ఈ వరద నీది గట్టెక్కడానికి సిద్ధపడాలి. ఓ ఉద్యోగం దొరికితే, రూర్కేలా, భిలాయ్ — ఎక్కడికన్నా వెళ్లిపోతే బాగుణ్ను. లేక మిలిటరీలో చేరిపోతే — మిలిటరీలోనే చేరిపోవాలని ఖాయపరుచుకొన్నాడు. రేపు తప్పకుండా విశాఖపట్టణం వెళ్లిపోవాలి.

అమ్మ కళ్లనూ, దీనావస్థనూ చూడలేక తమ్ముడు బయటికి వచ్చి అరుగుమీద ఉదాసీనంగా కూచున్నాడు, భూతాల చెట్టుకేసి చూస్తూ. తమ్ముడి జడప్రాయ చైతన్యాన్ని చూసి భరించలేక, సత్యం, అమ్మ హృదయ విదారక రోదనకు తట్టుకోలేక, పద్మక్కను ఊహిస్తూ, ఉత్తరదిశగా నది వేపు వెళ్లిపోయాడు.

పద్మక్క పుటంపెట్టిన రాగిలా మెరుస్తుండేది. ఆ కళ్ళు మంచితో నాని ఉండేవి. గొంతు నిండా ఆప్యాయం, సానుభూతి, కరుణ — దేవీ అవతారంలా ఉండేది. పద్మను చూస్తే అమ్మ విరిసిన సౌందర్యంలా సంతృప్తితో తొణికిస లాడేది; గర్వంగానూ ఉండేది. ఇద్దరు కొడుకులంటూ ఓ దృష్టి లేకపోయి ఉంటే కూతురుతోనే స్వర్గానికి పోయేది.

• • •

పచ్చగా గుబురుగా పెరిగిన చెట్ల శాఖల కిందినుంచి అర ఫర్లాంగు దాటితే — పూర్తి యవ్వనంతో ఒడ్డు ఒరుసుకు ఊగుతున్న నదీ దేవి. ఆకుపచ్చగా పరుచుకొన్న దృశ్యవలయం మీద నీలం మూకుడుగా ఆకాశం. పశ్చిమాన దిక్కుమాలిన తూర్పుకనుమలు. వరద వెల్లువకు స్వాగతం పాడే బంగాళాఖాతం తూర్పున. నది ఒడ్డుగా ఇసిక మేటలమీద చక్కగా పెరిగిన తోటలు.

సరుగుడు తోటల మధ్యనుంచి దారి చేసుకొంటూ పోతున్నాడు సత్యం. ఇసకలో అడుగులు జారుతున్నాయి. పాలుపులు మలుపులుగా

శ్రీపతి

తిరిగే నది ఒడ్డున, అక్కడా అక్కడా, కర్ర పుల్లలను ఏరుకొని ఒడ్డున పేనుకొంటున్నారు జనం — పశ్చిమంగా. తూర్పున సాలిహొండాం కొండ.

వరద నిన్నటికంటె తగ్గింది. కాని సుళ్లు తిరిగి రంపపుకోత పెట్టుకొంటూ ఉరుకుతున్నది. బురదనీటి జేగురురంగు పాతను ప్రక్షాళన చేసుకువచ్చినట్టుంది.

పశ్చిమ క్షితిజంమీద రంగుల చివరివెలుగు ప్రవాహంమీద ఆఖరి నృత్యం చేస్తున్నది. కల్లోలిత హృదయంలా ఉన్న నదిమీద పాడుతూ, పలకరించుతూ పోతున్నది సాగర స్పర్శిత పవనం.

కొన్ని పొలాలూ మునిగిపోయాయి. దానితో కొన్ని కుటుంబాల ఒకేటి బతుకులూ మునిగి పోయాయి.

అక్కడ, అలా అందని సృష్టి శక్తిని చూస్తూ నిలుచున్నాడు సత్యం. నదిలో దూకాలనిపించింది. ఒంటిమీది గుడ్డలు తీసేశాడు. ఒడ్డున నిలుచున్నాడు.

ఇరవైయేళ్ల తమ నిరుద్యోగి. బురదలా, కంపులా ఎప్పటికీ నిశ్శేషంకాని దరిద్రం. అవురావు రనే ఇల్లు. పొట్టల్లో ఆకలిమంటల క్రూరహింస. నగలు అమ్ముడుపోయినాయి. ఇంట్లోని వస్తువులు తాకట్టున్నాయి. పొలం అమ్ముకొన్నారు. పైకప్పు కారుతో ఇల్లు మిగిలింది. జల్లెడతో నీరు తెచ్చినట్టవుతున్నది ఏరోజు కారోజు.

పులకరించింది ఒళ్లు; జలదరించింది చల్లగాలికి. సత్యం యవ్వనం నవశక్తిలా విజృంభించింది చైతన్యంతో, దార్ఢ్యంతో. ఇంత శక్తి ఓ కుటుంబానికి ఆదుకోలేని నిర్వ్యాపారతకు నదిలో ఉరికేయాలనిపించింది. ఉద్రేకం హెచ్చిపోయింది. గుడ్డను చించినట్టు దూకి, నవఝరిని చీల్చేయాలనిపించింది. నదీ సర్ప మస్తకాన్ని చెప్పుకిందపెట్టి, తోకపట్టి, విషాన్ని కక్కించినట్టు తిప్పి, విసిరేయాలనిపించింది. నదిని సముద్రంలాంటి తన దోసిట్లోకి తీసుకొని నేరేడుపండులా చేసి నీలకంఠునిలా మింగేయాలనిపించింది. అదంతా తన శక్తికి అసాధ్యం; అతీతం; అందుకు గతిలేక, అసమర్థతకు, దౌర్భాగ్యానికి చావాలని అనిపించింది!

ఆకాశం ఎత్తుకు యవ్వనం విరాట్ రూపంతో పెరిగింది. సత్యం తనను పరిశీలించి చూసుకొన్నాడు. ఆకలిమంటలతో మండు

# కావలెను

కలకత్తా టెక్స్‌టైల్ మిల్లులో పని చేయడానికి ఒక సీనియర్ లేబర్ వెల్‌ఫేర్ ఆఫీసర్, హిందీ తెలిసినవారు కావలెను. ప్రారంభ వేతనం నెలకు రు. 700 లు. క్వార్టర్సు కూడా. అర్హతలు, అనుభవం వివరిస్తూ ఈ దిగువ చిరునామాకు దరఖాస్తు పెట్టండి : బాక్సు నంబరు 279 M, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు-2.





కండల నొప్పులు పోగొట్టుకోండి ఇదిగో

# అమృతాంజనము

అమృతాంజన్‌లో శమనాన్ని కలిగించే 10 రకాల ఔషధాలు ఉన్నాయి. త్వరగా నమ్మకంగా నివారణ కలిగిస్తుంది. అతి కొంచెము వాడవలసి ఉండటంచేత ఒకే సీసా నెలల పాటు వస్తుంది. 70 ఏళ్ళు పేరు గడించిన అమృతాంజన్ బెణుకులకు, తలనొప్పికి, గుండె జలుబుకు, ఇతర బాధలు, జలుబులు మరియు నొప్పులకు అమోఘమైనది.

గాలిమార్పు, నిత్యజీవితంలో తాపత్రయాలు నొప్పులను, జలుబులను ఇతర బాధలను కలిగిస్తాయి. ఇంట్లో ఒక అమృతాంజన్ సీసా ఉంచుకోండి.

అమృతాంజన్ 10 రకాల ఔషధాలు చేరిన మందు




అమృతాంజన్ క్రొత్తగా అట్టపెట్టెలో వస్తుంది. సీసా 'అలూ'ఖాప్‌తో సీలు చేయ బడి ఉంటుంది.

**అమృతాంజన్ లిమిటెడ్**

మద్రాసు - బొంబాయి - కలకత్తా - ఢిల్లీ

JWT-AM-2332


# కాటేసిన సిరి

తున్న ఇల్లు, వరదల వెల్లువలకు కూలిపోతున్నది సమూలంగా. ఒక్కసారి అమాంతం పిపీలిక అయిపోయి నేలను కరుచుకొన్నాడు.

ప్రవాహం మధ్యగా ఏదో ఏదో కన్పించింది. ఆరేళ్ల క్రితం పద్మక్క అలానే కన్పించింది జారిపోయిన క్షణంలో. పరుగెత్తుకు వెళ్లి ఇంట్లో చెప్పాడు. రాజయ్య దూకి శరంలా పోయి మోసుకువచ్చాడు. అమ్మ నెత్తీ నోరూ కొట్టుకోంది. సాయంకాలానికి పోలీసులు గుమిగూడారు. బంగారు బొమ్మలాంటి పద్మక్క మిగల్లేదు లోకానికి.

సత్యం తూర్పుకు చూశాడు. సరుగుడు తోటలో ఇసకమేటలమీద, పద్మక్క పంచాయితీ జరిగిన తర్వాత, అక్కడ, తనను రావద్దన్నారు. మరుసటిదినం దొంగగా, ఆశతో, వెళ్లి చూశాడు. తెల్లని బూడిద మిగిలింది మచ్చగా. ఆ చుట్టూ దయ్యాలు తొక్కినట్టుంది అందమైన ఇసక.

ప్రవాహంమీద పొంగిన తెల్లని గుడ్డ... సత్యం దృష్టిని మరొకసారి ఆకర్షించింది. పద్మక్కను తీసుకురావటానికి దూసుకుపోయిన రాజయ్య మెరుపులా మెరిశాడు స్మృతిపథాన. సాహసం, దేహదార్ఢ్యం, యవ్వనం, నిరాశ, అసమర్థత, బాధ, నిరాధారం, ఆత్మహత్య — సుడిగాలిలా, వాయుగుండంతో లేచిన కెరటంలా, అంటుకొన్న మంటలా, ఏముంయిందో, రక్తం ఎలా పొంగిందో, ఉన్మత్తత ఎలా రేగిందో, సత్యం ఒక్కసారి చుక్కతెగి రాలినట్టు దూకేశాడు... నదిలోకి.

నదీమాత సహస్ర కోమల శీతలాభయ హస్తాలతో పీటిమట్టానికి లేవనెత్తింది. కాలుతున్న తన మనసును చల్లగా ప్రాకింది నీటి చల్లందనం. ప్రవాహం ముందుకు ఒక్క తోపు తోసింది; మెడ గెంటినట్టు. చే పంజా విప్పి బారవిసిరాడు. ఇదెంత — గోదావరెంత— గంగెంత — ఇంగ్లీష్ ఛానెల్‌మాత్రం ఎంత — కాంతికిరణంలా వెళ్లాడు.

పొంగి తేలుతున్న చీర — వల్లగా తేలుతూ కేశరాశి. పట్టుకొని ఆవల ఒడ్డు వైపు ఉరికాడు.

చీకటి పులుముకొంది ప్రకృతి. కళ్లు తెరిచాయి నక్షత్రాలు. విశ్వం అనంతం — అనంతంగా పెరిగింది ఉత్తరవుటొడ్డు వైపు, సరుగుడుతోటల వైపు, చీకటి గోడ వైపు, ప్రవాహం దిశగా, ప్రవాహంకంటె తొందరగా. ఓ చేతిలో జీవన మరణ సమస్య; ఓ చేతిలో యవ్వనం నిండు సాహసం. రెండు చేతుల్లోనూ రక్షణ, రక్షణ.

ఒడ్డున నిలబడలేని ఒరపిడి. అడుగు అనుతుందేమో అనుకొన్నాడు; అందలేదు.

ఇంకా ముందుకు వెళ్ళాడు. ఇంకో ఫర్లాంగు తూర్పుకు వెళ్ళితేనేకాని ప్రవాహానికి ఒడ్డున ఉన్న ఒత్తిడి తగ్గలేదు. ఇసక పాదాలకు అందింది. కాని ప్రవాహం విసురుతున్నది. ఎదురు నిలబడడానికి భగీరథ యత్నం అవసరం అయింది.

ఆమెను ఒడ్డున వేసి ఎక్కాడు.

నిండు యవ్వనం — చీర జారిపోయింది. ముఖంలో కళాకాంతుల్లేవు. ఒంటిమీది నీరు మెల్లగా జారి ఇసికలో ఇంకుతున్నది. ముక్కు దగ్గర మండ పెట్టాడు. ఊహూం. చేయి పట్టుకొని నాడి వెతికాడు. అబ్బే! పొట్ట నీటితో నిండిపోయింది. గట్టిగా పొట్టను ఒత్తి చాడు. గొంతులోంచి నీరు రావడంలేదు. ఒళ్లంతా చల్లగా, చల్లగా, బిగుసుకుపోయి నట్టుంది.

మెడనిండా నగలు, బంగారం, మెరుస్తూ. పద్మక్క. అదే రూపు. అదే ఎత్తు. అదే శరీరం. అదే వయసు. పద్మక్కను ఆఖరిసారి ఇలానే చూశాడు. గుండె జలదరించింది. ఒంటరి. శవం తోడు. దట్టంగా మూగ్గా కురుస్తున్న చీకటి. భూతావేశంతో ఊళ లేశాయి చుట్టూ నక్కలు. ఝల్లుమంది ఒళ్ళు.

తన పద్మక్క... తన పద్మక్క... తన పద్మక్కే —కానీ, భయం; వణుకు; గుండెల్లో నృత్యావేశం. కల్లోలిత సముద్రం. పిరికితో, ఆవేశంతో, కంపంతో మోహం రెండు చేతు లతోనూ కావలించుకొని 'పద్మక్కా' అని అరి చాడు. ఆ గొంతు పిడుగులా అతని గుండె ల్లోనే కూలింది.

లేచి పక్కకు తప్పుకొన్నాడు. ఇసకమీద వెనక్కు చేతులాన్చి పూర్వ దిఙ్మండలానికి చూపు లంటించి స్తబ్ధుగా కూచున్నాడు.

కలలోంచి లేచాడు. కలంతా గుర్తుకు వస్తున్నది. అరుగుమీద కూచొన్నట్టుంది. గోడకూడ కన్పించని చీకటి. ఆ వెనక ఎక్కడో చిన్న దీపం వెలుగులా ఉంది. కళ్లు తడి అయాయి. అబ్బ! ఝడిసిపోయాడు. నిజంగా జరిగినట్టే ఉంది. కల... కల..:

తూర్పున వరదమీద బహుళజ్యోత్స్న పురివిప్పి ప్రతిఫలించింది. సగం వెన్నెల సాలి హొండాం కొండమీద న్యూస్తాలమీద పడింది. చెట్లమీద బహుళ తదియ జారుతున్నది అనుభూతిలా మందంగా. బంగాళాఖాతం మీది నుంచి పొంగివస్తున్న గాలి చలి అనిపించింది. నీరంతా జారి, ఇగిరి, దృఢంగా దేహం. తొడలకు నీటితో అండర్‌వేర్ అంటుకొన్నది. కింద ఇసక కరకరలాడుతున్నది. చేతులు తీసేసరికి చేతుల్లోంచి ఇసిక రాలుతున్నది. ప్రక్కనే ప్రవాహం ఒడ్డును కోతపెడుతూ రాసు కొంటూ పోతున్నది. ఎడంచేయి దగ్గర ఉత్త రావ యువ్వని అర్ధనగ్న శరీరం. దూరాన సంద్రపు హోరు.

సత్యం.

భ్రమ కాదు. కల కాదు. పద్మక్క కాదు. ఎవరో! ఎవరో? నిండా బంగారం. నిజం. తన కళ్ళు పోలేదు — మునివేళ్లతో వెతుక్కొన్నాడు సత్యం. చనిపోయింది. శవమే అది. మరి — ఎవరు... ఈ పద్మక్క? ఆరేళ్ల కిందటి పద్మక్క — అలాగే నిండుగా పసుప్పచ్చగా — ఎవరయి ఉంటుంది? ఏ ఊరు? ఎప్పుడూ లేంది ఏవిటీ నది — అప్పుడప్పుడు ఏవిటి ఇలా — పద్మక్కలాంటివాళ్లను బలిగొంటుంది?

నగలు ... నగలు ... నగలు ... నగలు... నగలు... నగలు... బంగారం ... సంపద... శ్రీరాం... నందివర్ధనం పువ్వులా... ఉన్నత విద్య ... ఉద్యోగం... బతుకు తీపిగా. . .

శవమే అది. కాళ్ల దగ్గరికి వచ్చింది లక్ష్మి. ఊం ఆ బంగారం ఏంచేస్తావో చెయ్. ఆలస్యం వద్దు. అదుగో వెన్నెల హెచ్చుతున్నది. లేలే. జనం పసికడతారు. వెంటాడుతారు. ఎర పెట్టిగాలమేస్తారు. ఊం. విప్పు. విప్పు. బంగారం. ఐశ్వర్యం. సుఖం. గౌరవం. విలువ. నగలు. ఆఁ! ఆఁ? చీకటి. తనను కబళిం చిన వెన్నెల. వరద విషదంష్ట్రలకు బలైన ఆమె ముగ్ధమోహన రూపంమీద సాను భూతితో సృష్టి జ్యోత్స్నవసనాన్ని కప్పింది. పాపిష్టి ప్రపంచపు సర్ప పరిష్వంగం ఈమె కంఠాన్ని ఇంకా వీడక నరరక్తం రుచిచూసిన క్రౌర్యంతో చూస్తున్నది.

సాహసంతో, మూర్ఖతతో, గుండె దిటవుతో రెండు చేతులూ వణుకుతూ, తేలిపోతూ, నగలను తాకాయి — గొలుసు — బరువుగా. ఎన్నిపేటలు! తలెత్తి జుత్తులోంచి జార్చి బయటికి తీశాడు. జుత్తుకు అంటుకొన్న ఇసిక రాలింది. ఎడమ చేతిలో తల.

పక్కనెక్కడ పెట్టడమో తెలీలేదు. ఏమీ కన్పించలేదు అండర్‌వేర్ తప్పించి. దేన్లో పెట్టడమో తెలీలేదు. రవికమీద చూపు నిలిచింది. ముడి విప్పాడు. బలంగా బిగుసుకు పోయింది ముడి. చేతులు జారడం లేదు. శవాన్ని కూచోబెట్టాడు. ముందు భాగంమీద పూతగా వెన్నెల. మెల్లగా కొన్ని దగ్గర్ల చించ డంతో ఊడింది రవిక. తొందర. వణుకు. తేలిపోతూ చేతులు. క్షుభితసాగరంలా గుండె కొట్టుకొంటూ, శ్వాస హెచ్చుతూ; ఒళ్లంతా ఉడుకెత్తిపోతూ — అబ్బ! యువ్వనం! జానకి!

తడి రవిక కింద పరిచాడు. నగ వేశాడు. కింద పచ్చిక. కింద మన్ను తడిగా. కాళ్లు చలి తోనూ, భీతితోనూ మేనంతా ఊపేస్తు న్నాయి.

దొంతి కాసులపేరు. విప్పడం చేతకాలేదు. గొలుసులాగే తలమీంచి లాగేశాడు. సరిగ్గా ముద్ద బడటంలేదు. సుమారుగా సోను కాఫీ డబ్బా బరువుంది..

(తరువాయి 51 వ పేజీలో)



మధురభావన
చిత్రం—వై. కాలయ్య (నారాయణరావుపేట)

# కాటేసిన సిరి

( 7 వ పేజీ తరువాయి)

మనిషిని పశువుగా చేసేయగలిగిన యవ్వనం. వాంఛలన్నిటినీ క్షణక్షణానికీ గుణించి పెంచి, అసంతృప్తినిమాత్రమే దాచుకొనే ఏ సుఖం కూడా సంతృప్తిపరచలేని అవయవాలు. పెదాలమీద ఎదుటి హృదయాలను పిలిచే సరహాసం. ఆ నగలన్నీ ఆ సౌందర్యనిధి కాలి గోటికి సరిపోని అల్పమైన కానుక.

బ్రతికే ఆశ ఎక్కడా లేదా? ఆమె నరాల్లో ఉష్ణం కదలాడి, గుండె కొట్టుకొని, శ్వాస పీల్చగలిగితే — ఛీ, ఈ బంగారం ఎందుకు? ఆమెను కూచోబెట్టి ఆ హక్కుదారుకు అప్ప చెప్పగలిగితే —

పద్మక్కను అలా అప్పజెప్పగలిగి ఉంటే— అప్పటికీ 'శభాస్' అన్నారు రాజయ్యను. రాజయ్య బతుకు బంగారంలా ఉందిపుడు.

వెన్నెల తెల తెల్లగా.

శేశే. విప్పు. విప్పు. ఆలస్యం వద్దు. వద్దు.

నగలు. సంపద. సుఖం. విలువ. ఉన్నత విద్య. బతుకు తీపి.

నెక్‌లేస్‌లో రవలు మెరుస్తున్నాయి. కొలికి జార్చి తీసేయగలిగాడు. రవికమీద వేశాడు.

సత్యం రక్తంవేడి నిమిష నిమిషానికీ హెచ్చు తున్నది, భయం గుండెను కల్వంలో నూరుతూ.

వెన్నెల పెరిగి చెట్లలోకి ప్రాకుతుంటే తన వెనుక 'దౌర్జన్యం. దొంగ. హంతకుడవు' అని కేకలు వేసి అరిచే జనం హెచ్చవుతున్నట్టు, ఒక్కొక్కరే లక్షలాది ఈ పాపాన్ని చూడలేక ప్రతీకారవాంఛతో చేరుకొంటున్నట్టు...

భయపీడితుడై పక్కకు, వెనక్కు, చుట్టూ చూశాడు.

ఆవలి ఒడ్డున శవ దహనం.

దహనం.

చితిలో పడినట్టుంది సత్యానికి.

చేతుల్లోని బంగారు గాజులు నగలపోగు మీద వేశాడు.

పురుష వాంఛలను ఉసికొల్పే, వెల్లకిలా పడివున్న స్త్రీ అర్ధనగ్న సృష్టి. తాత్కాలిక వైరాగ్యాన్ని కెలుకుతున్న...

ఆవలి ఒడ్డున శవాన్ని పొడుస్తూ మంట రేపుతున్నారు.

పుస్తెలతాడు. మాంగల్యం. సులభంగా కుడి చెవిమీంచి జుత్తును తాకుతూ తలమీది నుంచి తీసేశాడు.

కళ్ళ ఫాలాన్ని, కుంకుమశోభను వెతికాయి. వరదపాదం బొటనవేలుతో చెరిపేసినట్టుంది.

ఛీ! ఛీ!

'దౌర్జన్యం — దొంగ — హంతకుడు'... ధ్వనులు క్రూరంగా, అనంతంగా పెరిగి చెవుల్ని గింగుర్లెత్తిపోతున్నట్టు, తనచుట్టూ విలయావేశంతో జనం సమీపిస్తున్నట్టు.



మలుపు

ఫోటో — ఎస్. ఎస్. లాల్ (సేలం-7)

వెతుకుతున్నాడు.

తప్పు. హంతకుడవే. రాక్షసి! తప్పుకో! శ్రీరాం శోభ — కష్టార్జితం కాదు. తనకు తెలుసు. బావ ఆస్తి శ్రమార్జితం కాదు — తనకు తెలుసు. తప్పేమీ కాదు. సముద్రంలో కలిసి వ్యర్థమయేది. బూడిదలో పోసిన పన్నీరయేది. అదృష్టం అలా వచ్చింది. సిరి కాళ్ళ పట్టింది. తన్నేసేవాడు గుడ్డివాడు. భగవంతుడే ఇచ్చాడు కష్టాలు చూసి, రక్షించాలని.

అన్ని భయాలనుంచి, మానసిక క్షోభల నుంచి లాగేసింది యువ్వని యవ్వనం. సౌందర్యం ఎక్కడో ఉన్నట్టు వెతికాడు రెండు చేతులతో. ఆ అనుభూతి మెదడులో ఒక్కసారి రక్తం మెరుపుశక్తితో పోటెచ్చింది. తల బద్దలయినట్టయింది.

నాను — కంఠపట్టెడ — రెండు మిగిలాయి ఇంకా. శిరస్సు పగులుతున్నది.

నాను కొంచెం వదులుగా ఉంది.

వెల్లకిలా పడున్న శరీరాన్ని పక్కవాటుగా వేశాడు. నాను విప్పేసి నగలరాశిమీద పడేశాడు. రవిక నిండిపోయింది సంఘంలోని పరువూ ప్రతిష్ఠలతో.

కంఠపట్టెడ మెడను గట్టిగా పట్టి ఉంది. మధ్య బిళ్ళలను కూర్చిన తాడు తడికి నాని బిగుసుకుపోయింది. ఎడమచేయితో తల నేలమీద పడకుండా ఎత్తాడు. ఒక్క చేతితో విప్పడానికి సదుపాయం లేకపోయింది. బిగువుగా కంఠానికి పట్టేసి ఉంది. చేతికి మర దొరకడంలేదు. మెడనెత్తి కూచోబెట్టబోయాడు. కష్టమయింది. కడుపునిండా నీరు. కుడికాల్ను మడిచి ఆ వీపుకు అడ్డుపెట్టాడు. జుత్తు ఇసకతో వీపుమీద. మర వ్రేళ్ళకు అందింది. నులిపి విప్పుతున్నాడు. మర జారి పడిపోయింది కింద ఇసకలో.

పట్టెడ లాగాడు—

గొంతులోంచి ఆ నిశ్శబ్దంలో 'ఏవ్' మని, బుక్కెడు నీటితో చిన్న ధ్వని తుళ్ళింది. సత్యం నరనరాలు తెగిన వీణ తీగెల్లా వణికాయి. చేతుల్లోంచి నగ భారమై పడిపోయింది. చుట్టూ భీతావహ నరకఘోష అనంతంగా పెరిగిపోయింది. శూన్యం మింగేసినట్టు — తల ఛిన్నాభిన్నమై తుళ్ళిపోతున్నట్టు — శిక్ష — శిక్ష.

సత్యం కళ్ళు పెద్దవయాయి. ముఖం నిండా చెమట — గుండె ఒకటే హోరుతో— రక్తం వేడిపోటు — సలసల మరుగుతున్న నీటిలా — కంపరమెత్తిపోయింది ప్రాణం. మానసిక సంక్షోభం పెరిగి తనను పిడికిట్లో పెట్టుకొని పిండుతున్నది కార్పణ్యంతో.

శ్రీరాం. శ్రీరాం.

పాదాలను పట్టుకొన్న భాగ్యం. చల్లబడ్డాడు... తాపీగా.

నగ వెతికాడు. తీసి రవికలో వేశాడు. మూటగట్టాడు. శవాన్ని అమాంతం చంకలో పెట్టుకొన్నాడు. మూటను ఎడంచేత్తో పట్టుకొన్నాడు. నీటిలోకి దిగాడు. ప్రాణాంతకంగా ఉంది ప్రవాహం.

వెన్నెల. దక్షిణపుటొడ్డున పుల్లేరుకొనే

నీడలు అక్కడా అక్కడా ఒకటే అరా. కొండ చరియలో, నది పక్కన శవదహనం. జ్వాల అక్కడి నలుగురైదుగురి ముఖాలమీద మృత్యు నృత్యం చేస్తున్నది. వెన్నెల ఏటిలో మాటు కాసింది.

నీటిలో వదిలివేశాడు శవాన్ని. ప్రవాహం ప్రేమతో లాక్కుపోయింది.

ఎదురీత—

శవం దూరమౌతున్నకొద్దీ గుండె బరువౌతున్నది. ఆ రూపం వెన్నంటుతున్నది. ఆ నగ్నత్వం మేధకు అందని ఉన్మత్తశక్తితో గుండెమీద కొండలా కూచున్నది.

మొదట్లో మూట ఎడంచేత్తో పట్టుకొన్నాడు. లాభంలేదనిపించటంతో మూట నోటితో పట్టుకొని రెండో చేయి విసిరాడు. బారలాగి, బారవిసిరి, ఊపు పెంచుతుంటే— ప్రవాహం శక్తిలో ముందుకే పోతున్నాడో వెనక్కేనో తెలీడం లేదు. ప్రవాహం మధ్యకు వచ్చేశాడు. బాగా అలసిపోయాడు. ఏ దిక్కూ తోచలేదు. మరి ముందుకు వెళ్లడం చేతకాదు. అడ్డంగా పడిపోతే శవదహనం దగ్గర ఒడ్డు చేరుకోవలసి వస్తుంది.

వెన్నెల పండి, ప్రకృతి పరిమళం తొణికిసలాడి సౌందర్యం చిందుతున్నది. నది రాజ్యమేలుతున్నది ఆ సుందర వాతావరణంలో. దోషిగా బంధింపబడి తన కొలువులోకి సత్యాన్ని తీసుకువచ్చినట్టుంది. నదీమాత కరుణతో తన జీవనమరణ సమస్య ముడిపడినట్టుంది. క్షణం నిలువీత. గజయీతగాడు సత్యం. ఏముందో ఆ శక్తి! ఆశ్చర్యం! మధ్యలో, ఒంటరిగా సత్యం. ఎదురీదే శక్తిసామర్థ్యాలు హరించిపోయాయి. నీటిలో కూలిపోతున్నాడు సత్యం. ప్రవాహం లాగేసింది. ప్రవాహం దిశలో ఊరికి దూరమౌతున్నా సరే పోవాలనుకొన్నాడు. వెల్లకిలా పడి ఆకాశాన్ని చూశాడు. నోటిలోని సంచి కుడిచేతిలోకి తీసుకొన్నాడు.

## కాటేసిన సిరి

అక్కడక్కడ పేలవంగా నక్షత్రాలు. అంతటా అలుముకొన్న అర్థంకాని కాంతి. వెలుగులాగే, ఆశలాగే ఉండి, ఏదీ స్పష్టంగా, సత్యంగా కన్పించని వెలుగు. ఏమీ కన్పించడం లేదు. భూమీ కన్పించడం లేదు. శవదహనమూ కన్పించడంలేదు. కనిపిస్తున్నదంతా అర్థంకాని సత్యం రహస్యంలాంటి చీకటి. నీలం కెరటాల నీటిలో వణికే జాబిలి. ఐశ్వర్యాన్ని దోచేసి పరిత్యక్త కాంతిహీన, నగ్నయౌవని మృత కళేబరం.

సుమారు మైలు ప్రవాహం దిశగా, తూర్పుగా పోయి ఒడ్డు చేరుకొన్నాడు. నీరసంగా ఇసక పరుపుమీద చతికిలపడిపోయాడు. కదిలే శక్తి కూలిపోయింది పునాదులతో.

శవం అరువు. శవం అరువు. శవం అరువు.

కల...

తనంతవని చేయగలిగాడా — తనేనా — సందేహం.

కలకాదని, ఇసకమీద పెట్టేసి చేత్తో పట్టుకొన్న మూట. బరువు. కనకం. సంపద. సంఘంలో గౌరవం. ఘనత. అభివృద్ధి. విజ్ఞానం. జానకి. జీవితంలో శ్రీరాంలా.

పద్మక్క చనిపోవడం నిజం. చావలేదే అనుకొన్నాడు. నమ్మలేకపోయాడు. నిజం. శ్రీరాం భోగభాగ్యాలు నిజం. అమ్మ రోదన — కడుపుమంట — నిద్రలేమి — రోగాల పీడ— అప్పుల గోల — దరిద్రం ముద్ర — సంఘం చిన్నచూపు — పరిస్థితుల క్రౌర్యం — అంతా నిజం. నిజం.

వలిచిన కొబ్బరికాయలా ఉంది రవిక మూట.

నక్క లేడ్చాయి ఎక్కడో ఒక్కుమ్మడిగా.

లేచాడు. చెట్ల నీడలమధ్యనుంచి ఒక్కడూ. సుమారు రెండుమైళ్ల దూరంలో ఊరు. పక్కనే ఊరుంది. ఊరును తప్పించుకొని దక్షిణంగా పోయి పొలాలమీంచి పోవాలనుకొన్నాడు. మేఘం ఈశాన్యంనుంచి పెరిగి క్రమంగా పాలించడానికి ఆకాశాన్ని ఆక్రమించుకొంటున్నది. చీకటి చేతులు విప్పి సాచింది దిగంతాలకు.

నడక. నడక.

వేగం — ఉద్వేగం.

తొందర. భయం.

వెనక కోటి కోటి గొంతుల కసి —

'దౌర్జన్యం — దొంగ — హంతకుడు' — నినాదాలు.

'రాక్షసీ — తప్పుకో' — అరుపులు.

సత్యం పరుగులో.

పరుగిడుతూ — పరుగిడుతూ, గట్లమీంచి— జారుతూ, తడబడుతూ — దిక్కులు కన్పించక, దిక్కుతోచక, అసహాయంలో, అంధకారంలో.

ఆగాడు. నడక. మెల్లగా. చేతిలో మూట. బరువు బరువుగా. మూటలో రేపు రేపు తీపి. సుందర సుఖమయ జీవితం. ఆశాదుందుభి మోత.

సంక్షుభిత భ్రమణంలో చీకటి మేఘాలు. కింద నిర్లక్ష్యంగా సమస్త ప్రకృతి. మధ్య చిక్కుకొన్న సత్యం.

దారిని పడ్డాడు. పరుగు.

స్వాతంత్ర్యానికి ఆపద వాటిల్లినది, మీ సర్వశక్తులా దానిని కాపాడండి — జవహర్‌లాల్ నెహ్రూ
**పొదుపు చేసేవారు కూడా దేశసేవ చేస్తున్నట్లే**
దేశరక్షణ సర్టిఫికెట్లను కొనండి

దేశాన్ని మరింత శక్తివంతముగా చేయడానికి, స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకొనడానికి మన సాధన, సంపత్తుల నన్నిటినీ సమీకరించుకోవాలి. ఆయుధాలు, మందుగుండు సామగ్రివలెనే పొదుపుచేసి, ప్రభుత్వపు దేశరక్షణ సెక్యూరిటీలలో మదుపుపెట్టిన ప్రతి చిన్న మొత్తమూ దేశరక్షణకు అతి ముఖ్యమైనది.
**స్వాతంత్ర్య రక్షణకై మదుపుపెట్టండి**
DA 63/F8



అలసట.

దూరాన శవదహనం మెరుపు.

శవం అరుపు. శవం అరుపు. శవం అరుపు.

శవం అరుస్తుందా — అరవదేమో — భ్రమేనా లేక బతికే ఉందేమో — తన చేతుల్లోనే ప్రాణాలు విడిచిందో — బంగారంతో ఆశ పెనుగులాడి — రక్షణ శ్రద్ధ తీసుకోలేదేమో!?

పద్మక్కలా కన్పించింది. పద్మక్కే అయితే —

యవ్వనం చూసేసరికి జానకిలా ఉంది. రూపశోభ పద్మక్కలా ఉంది. నేను రెండుగా చీలింది. యవ్వనం నేను జానకి. అనురాగం నేను పద్మక్క. ఛీఛీ — నేనూ శ్రీరాంనే. ఛీఛీ — కాని — ఆకలి — రోదన — అమ్మ — కురిసే పైకప్పులు — దిక్కులేని దీనాతిదీనావస్థ నిరుద్యోగం.

* * *

తమ్ముడు అరుగుమీద చీకట్లో ఓ పక్క

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

# దీపావళి కథల పోటీ

## 1,500 రూపాయల బహుమతులు

ప్రతి ఏడాదివలెనే శోభకృతులోకూడా దీపావళి సందర్భంలో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక కథల పోటీ నిర్వహిస్తున్నది.

**శుభకృతులో 1,200 రూపాయల బహుమతులు ఇచ్చాము. అతోధికమైన ప్రోత్సాహం ఇచ్చే నిమిత్తం ఈ ఏడాది 1,500 రూపాయల బహుమతులు ఇవ్వడానికి నిశ్చయించాము.**

తెలుగు రచయితలు ఈ అవకాశం వినియోగించుకొని, పాఠకులకు ఉత్తమమైన కథలు సమర్పించాలనే మా పూనిక విజయవంతంగా నెరవేరడానికి తోడ్పడాలని అర్థిస్తున్నాము.

**మొదటి బహుమతి 600 :: రెండవ బహుమతి 400**

**మూడవ బహుమతి 300**

**రెండు కన్సొలేషన్ బహుమతులు : చెరొక 100**

దీపావళి కథల పోటీ నిబంధనలు :

1. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
2. స్వీయరచనలే కాని అనువాదాలు పంపరాదు.
3. రచన అరఠావు సైజులో 12 పేజీలకు మించరాదు.
4. సిరాతో కాగితానికి ఒకప్రక్కనే వ్రాయాలి.
5. బహుమతి పొందని కథలలో యోగ్యమైనవి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
6. పోటీకి రచన పంపేటప్పుడు కవరు మీద 'దీపావళి కథల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.
7. బహుమతి పొందని కథలలో ప్రచురణార్హం కానివి త్రిప్పి పంపే నిమిత్తం తగుమాత్రం తపాలాబిళ్ళలు అంటించిన, చిరునామా కలిగిన కవరు జతపరిచి పంపవలసి ఉన్నది. లేకపోతే వాటిని త్రిప్పి పంపడం జరుగదు.
8. రచనలు 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, చిత్తూరు'కు పంపాలి.

**బహుమతి పొందిన కథలను ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురించగలము**

| | |
|---|---|
| దీపావళి కథల పోటీకి రచనలు మాకు చేరవలసిన ఆఖరి తేది | **1963 అక్టోబరు 1** |


## కాటేసిన సిరి

కడుపులోకి కాళ్లు ముడుచుకొని నిద్రపోతున్నాడు. దొంగతనంగా, సందుల్లోంచి, పిరికి

**చీకటిని చీల్చుకొని వచ్చిన సత్యం నిట్టూర్పు కూడ విడవలేని అలసటతో, బరువుమూటతో అడుగుపెట్టాడు. కూలిపోయి గోడకానుకొని కూచొన్న అమ్మ అడుగుల అలసట శబ్దానికి త్రుళ్లిపడి లేచింది.**

నిద్రాహారాల్లేక చితికిపోయిన ఆమె ఆరోగ్యం మంచి అనే చిన్న ఆశతో ముడిపడి ఉంది. మంచివాళ్లనే దేవుడు కాపాడుతాడని, పద్మ పోయినా సత్యం మిగిలి ఉన్నాడని — ఆశా కిరణం ఆమె స్మృతిపథాన చోటు చేసుకొని దాగి ఉంది.

'అమ్మా!' అని ఒక్కడుగు ముందుకేసి, శంకించి, తలుపులు రెండూ మూసేసి వెళ్లి అమ్మదగ్గర మూట పెట్టాడు.

ముడి విప్పాడు సత్యం.

రవిక. రవిక.

కూతురు —

పద్మ —

కళ్లు జిగేల్‌మన్నాయి.

ఆడదాని ఒంటిమీది నగలు.

కళ్లు నిర్జీవమైపోయాయి. చేతులు ప్రేతకళతో విప్పారిపోయాయి.

పెరుగుతూ పెరుగుతూ సృష్టి నలుమూలలా రాకాసిభూతాలు — సత్యం గుండె మీద పద్మక్క శవాలు — పదే పదే పదఘట్టన. విలయ నృత్యం.

* * *

శ్రీరాం జానకి దగ్గరినుంచి తిరిగి వస్తున్నాడు — వాంఛ తినేసిన నెత్తుటి అనుభవాన్ని మోసుకొంటూ. భూతాలచెట్టు దగ్గరికి వచ్చేసరికి ఓ యువకంఠం గావుకేక పిడుగుపాటులా వినిపించింది. తట్టుకోలేక కంపితుడై శిలాప్రతిమలా నిలబడిపోయాడు.

పెద్ద మెరుపు సృష్టినంతటినీ వెతగ్గా ఒక్క శ్రీరాంమాత్రం కన్పించాడు — ఆ అర్ధరాత్రి. తుఫాన్‌గాలి భూతాలచెట్టును వణికించింది. పెద్ద పెద్ద చినుకులతో వర్షం చిటపటలాడింది.

"పాపిష్టి బతుకులు — ఎప్పుడూ ఏడుపులే— అబ్బ! దయ్యం పట్టుకొన్నట్టయింది" అని సర్దుకొని, కర్కశంగా తిట్టేసి కదిలిపోయాడు శ్రీరాం.

ఆ వర్షపు హోరులో — ఒక మాతృమూర్తి హృదయస్పందననూ, ఒక ఆశాదుందుభి చివరి మోతనూ — ఎవరు లెక్కించారని!

చరిత్ర ఏం మిగిల్చిందీస్పష్టే చెప్పుకోవాలి. ★